# బంధువులు రావడం తప్పా?

* రచన : శ్రీమతి కనకదుర్గ. *

‘‘మా యింటికి బంధువులు వచ్చారు,’ అంటూ వెళ్ళిపోయింది మా ఎదురింటి సీతమ్మ గారు, బంధువులు అనగానే జ్ఞాపకం వచ్చింది. ఈమధ్యనే మా యింటికి వచ్చారు బంధువులు వేసవికాలం పిల్లలకు సెలవు ఇచ్చారు హైదరాబాద్ చూద్దామని, ఇక్కడ చల్లగా ఉంటుంది అని ఎవరో చెప్పారట వాళ్ళకి. (నలుగురు పిల్లలతో ఉన్న వాళ్ళు) ఎక్కువరోజులు ఉంటే ఎలాగా అని నా భయం. ఇక్కడా ఎండలు మండిపోతున్నాయండీ అన్నాను.

‘‘ఎలాఅయినా మాకాకినాడకంటే నయమేనేమో’’ అంది ఆ వచ్చిన ఆవిడ. మాది మధ్యతరగతి కుటుంబం. మాకూ నలుగురు పిల్లలు ఉన్నారు. చాలీచాలని జీతాలతో కాలక్షేపం చేస్తున్నాము. అటువంటప్పుడు ఇంకొక సంసారాన్ని భరించడం చాలకష్టం. అలాగని వాళ్ళ దగ్గరబంధువులా అంటే అదీకాదు. మా మామగారి పెదతండ్రి కొడుకు-కోడలు. పెద్ద మాకు అంత దగ్గర బంధువులు కాదు. బంధువులు రావడం తప్పు అని నేను అనను కాని వాళ్ళు కొంచెం విచక్షణాజ్ఞానంతో ఉంటే ఫర్వాలేదు. వాళ్ళు ఉన్న పదిరోజులు నా తల ప్రాణం తోకకు వచ్చింది.

పిల్లల అల్లరి ఎక్కువ. ఏమైనా అంటే ఆవిడకు మహాకోపం. పదిరోజులు వచ్చే సబ్బు నాలుగు రోజుల్లో అరగదీశారు. కొబ్బరినూనె కిందా మీదా పోసి రాసుకోవడం, అన్నాలు ఏనాడు ఎరగని వాళ్ళలా ఆవురావురుమని తినడం, ఆవిడగారు పిల్లల బట్టలకని మా సర్ఫ్ డబ్బా ఖాళీ చెయ్యడం, కనీసం పక్క బట్టలయినా తెచ్చుకోవకుండా మా దుప్పట్లనే ధ్వంసం చేయడం, ఇదంతా చూస్తుంటే నాలో సహనం చచ్చిపోయేది.

ఈ సంగతి మా శ్రీవారితో అంటే, ‘పోనిద్దూ వాళ్ళున్న పదిరోజులు ఓపికపడుదూ! ఏం చేస్తాం బావుండదు మరి’ అనేవారు.

వాళ్ళ కేంప్ ఇన్ని రోజులని నిర్ధారించుకొన్నప్పుడు పూర్తిగా అవతలివారిమీద ఆధారపడకుండా, నిత్యం అవసరమైన సోపు, నూనె, టవల్స్ పడుకొనేటందుకు (హోల్డాలు ఎలాగూ ఉంటుంది కాబటి) నాలుగు దుప్పట్లు తెచ్చుకుంటే బావుంటుందని నా ఉద్దేశ్యం. పూటకూళ్ళలా ఇంట్లో భోంచెయ్యడం - ఊరిమీద పడటం— బయట టిఫిన్ కూడా ఏమీ తినేవారు కాదనుకుంటా. ఇంటికి వస్తూనే పిల్లలు ఆకలి-ఆకలి అని గోలచేసేవారు. సుష్టుగా భోంచేసి నిద్దర్లకి పడేవారు. ఆ యిల్లంతా సర్దుకునేసరికి రాత్రి 11 గంటలు అయ్యేది. కొంచెమయినా సహాయం చేద్దామని ఆ యిల్లాలికి ఉండేదికాదు (అందరూ అలావుంటారని నేననడం లేదు) భోజనపు ఖర్చు మనకు ఎలాగూ తప్పదు. ఇటువంటి చిన్న చిన్న వస్తువులు కూడా తెచ్చుకొంటే, ఇవతలివారికి చాలా సహాయం చేసినవారవుతారు. వారి సంసార పరిస్థితులు అర్థం చేసుకుని మసలుకుంటే ఫర్వాలేదు కాని బంధువులు రావద్దు అని నేననడంలేదు. ఎదుటివారి మనసుకి కష్టం కలుగకుండా చేసే బంధువులు అయితే అందరికీ ఆనందమే!